క్లుప్తంగా

నేడు మైసమ్మ దేవాలయంలో టెండర్లు

నవాబుపేట: పర్వతాపూర్ మైసమ్మ దేవాలయంలో బుధవారం ప్రసాద విక్రయాలకు సంబంధించి టెండర్లు నిర్వహిస్తున్నట్లు దేవాలయ అధికారి మధనేశ్వర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ కృష్ణయ్య మంగళవారం 11 గంటలకు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. కాగా గత ఏడాది ప్రసాదాల టెండర్ రూ. 11 లక్షలు పలికింది.

చదువుపై దృష్టి పెట్టాలి

మహబూబ్‌నగర్ క్రైం: బాలబాలికలు చదువుపై దృష్టి పెట్టి క్రమశిక్షణతో కృషి చేయడం వల్ల ఉత్తమ భవిష్యత్ లభిస్తుందని జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మంగళవారం రాత్రి జమిస్తాపూర్‌లో సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు చేయరాదని, ఎవరైనా అలా చేస్తే చైల్డ్‌లైన్ నెంబర్ 1098కి సమాచారం ఇవ్వాలన్నారు. డీఎస్పీ టి.మహేష్, రూరల్ సీఐ డి.స్వామిగౌడ్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సొంత వాహనాలను తొలగించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ శాఖల్లో కొందరు జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు సొంత వాహనాలను తమ అధికార వాహనంగా వాడుకుంటున్నారని.. వెంటనే వాటిని తొలగించాలని డీఆర్‌ఓ రవికుమార్ సర్క్యులర్‌ను ఇవ్వడంపై తెలంగాణ ఫోర్ వీలర్స్, హైర్ వెహికిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అధికారులు సొంతవాహనాలను తీసివేయాలని అనేక సంవత్సరాలుగా తమ యూనియన్ పోరాటం చేస్తుందని తెలిపారు. అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చినట్లు తెలిపారు.

కొనసాగుతున్న దీక్షలు

జడ్చర్ల టౌన్: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీవర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ చేస్తున్న దీక్ష 8వరోజు మంగళవారం కొనసాగింది. జిల్లా ప్రధానకార్యదర్శి వినోద్, అధ్యక్షుడు రాజు, ఫకీర్‌హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జహంగీర్ నాయకులు పాల్గొన్నారు.

పగిలిన 'భగీరథ' మెయిన్ పైపులైన్



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ధర్మాపూర్ శివారులో మూడు రోజుల క్రితం మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయింది. దీంతో పట్టణంలోని సగం ప్రాంతానికి తాగునీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు స్పందించిన మున్సిపల్ అధికారులు దానిని బాగు చేయించి మంగళవారం తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. ఇదిలాఉండగా తమకు నాలుగు రోజులుగా తాగునీరు అందలేదని 25వ వార్డు ప్రజలు వాపోయారు. కాగా, వారి విజ్ఞప్తి మేరకు గణేష్ చవితి పండుగ రోజు మున్సిపల్ ట్యాంకర్ ద్వారా గౌడ్స్‌కాలనీకి తాగునీరు అందించారు.

21న అవగాహన సదస్సు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని పోస్టాఫీసులో తపాల సేవలపై ఈనెల 21 గురువారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తపాల అధికారి రవికుమార్ తెలియజేశారు. డాక్ కమ్యూనిటి డెవలప్‌మెంట్ కార్యలో భాగంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి

జడ్చర్ల: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ మంగళవారం జడ్చర్లలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య, కృష్ణ, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభావతి, సరోజ, జ్యోతి, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

అడ్డాకుల: పెద్దమునుగల్‌ఛేడ్‌కి చెందిన వెంకట్రాములుకు సీఎం సహాయనిధి ద్వారా రూ.2లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు.

సొంతింటి కల నెరవేరుతోంది

మహమ్మదాబాద్: పేదల సొంతింటి కల నెరవేరుతోందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

వికారాబాద్‌లో కలపాలని ఆందోళన

మహమ్మదాబాద్: గాధిర్యాల్‌ను వికారాబాద్ జిల్లాలో కలపాలని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. మంగళవారం ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డిని కలిశారు. వినతిపత్రం అందించారు. సర్పంచ్ వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

జై జై గణేశా..జై కొడతాం గణేశా




పాతపాలమూర్‌లో వేడుకల్లో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్ గౌడ్




పూజలు చేస్తున్న ఎస్పీ కె.నరసింహ



బ్రాహ్మణవాడిలో..



క్లాక్‌టవర్ వద్ద హమాలీ సంఘం ఆధ్వర్యంలో



జిల్లాకేంద్రం ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో..

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలోని మండలాలు, మున్సిపాలిటీలు, నియోజకవర్గ కేంద్రాలు, గ్రామాల్లో సోమవారం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండపాలను ఏర్పాటు చేసి ప్రత్యేకపూజలు చేశారు.

- జిల్లా కేంద్రంలోని గణేష్ నగర్ మండపం వద్ద నిత్యాన్నదానం చేపట్టనున్నారు.
- పండుగలు సంప్రదాయానికి ప్రతీకలని కలెక్టరేట్ ఏఓ శంకర్ అన్నారు. నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేందర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన గణేష్‌కు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీటీ రాజ్‌గోపాల్, సంఘం కార్యదర్శి రామకృష్ణ, కృష్ణకుమార్, యుగేంధర్, కాశన్న, పాల్గొన్నారు.
- జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని వీరశివాజినగర్‌లో ఆదిత్య ఎల్ 1 ఉపగ్రహాన్ని వినాయకుడు మోసుకెళ్తున్నట్లుగా ప్రతిష్ఠించిన విగ్రహం ఆకట్టుకుంటోంది. అదేవిధంగా శివాజినగర్‌లో చంద్రయాన్ 3 వినాయకుడిని ప్రతిష్ఠించారు. పూజల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి పాల్గొన్నారు.
- కోడూర్‌లో సోమవారం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో మట్టి గణపతులను పంపిణీ చేశారు. డీసీసీబీ డైరెక్టర్ పి.నర్సిములు, మన్యంకొండ పాలక మండలి సభ్యుడు చిన్నయ్యగౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ కృష్ణయ్యగౌడ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.
- వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ కె.నరసింహ అన్నారు. జిల్లా పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. పోలీసులు సూచించిన నిబంధనలను ప్రజలు తప్పక పాటించలన్నారు. మహబూబ్‌నగర్ హెడ్‌క్వార్టర్స్ ఎదుట మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. జడ్చర్లలోనూ పంపిణీలో పాల్గొన్నారు.
- మూసాపేట, అడ్డాకుల మండలాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.
- నవాబుపేట మండలంలోని గ్రామాల్లో వైభవంగా వేడుకలు జరిగాయి.
- రాజాపూర్‌తో పాటు గ్రామాల్లో వినాయకుడు పూజలు అందుకున్నాడు. మండల కేంద్రంలో అన్నదానం చేశారు. వైస్‌ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ బచ్చిరెడ్డి నరహరి పాల్గొన్నారు.
- బాలానగర్ తోపాటు గ్రామాల్లో గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు.
- భూత్పూర్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాలల్లో బుధవారం భక్తి శ్రద్ధలతో గణనాథులను ప్రతిష్ఠించారు. వేడుకల్లో చైర్మన్ బస్వరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.
- కోయిల్‌కొండలో మండలంలో వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి.



జడ్చర్ల హౌజింగ్‌బోర్డు కాలనీలో..



జిల్లాకేంద్రంలోని గణేశ్ నగర్‌లో..



జిల్లాకేంద్రం రామమందిర్ చౌరస్తాలో



కలెక్టరేట్‌లో..



భూత్పూర్‌లో గణనాథుడికి పూజలు



మూసాపేట బీసీకాలనీలో..



రాజాపూర్‌లో..

శివుడికి అభిషేకం

రాజాపూర్: డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి సోమవారం ముదిరెడ్డిపల్లిలో కృష్ణా నుంచి తెచ్చిన నీటితో శివుడికి అభిషేకం చేశారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలతో నియోజకవర్గానికి లక్షన్నర ఎకరాలకు పైగా సాగునీరు అందుతుందన్నారు. సర్పంచ్ పెంటయ్య, ఎంపీటీసీ శేఖర్‌గౌడ్, ఉప సర్పంచ్ వెంకటయ్యగౌడ్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, నారాయణగౌడ్,రాజు పాల్గొన్నారు.

లోకాయుక్త ఉత్తర్వులు అమలు చేయాలి

జడ్చర్ల టౌన్: పోలేపల్లి కేటీఆర్ వాటర్‌ప్లాంట్ విషయంలో లోకాయుక్త ఆగస్టు 30న ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయాలని కోరుతూ మంగళవారం గ్రామానికి చెందిన నాగోజీ తదితరులు కలెక్టర్, ఆర్‌డీఓ, డీపీఓ, సర్పంచ్‌లకు వినతిపత్రాలు సమర్పించారు. ప్లాంట్ ద్వారా వచ్చే వ్యర్థపదార్థాలను చెరువులో వదలటం వల్ల చేపలు చనిపోతున్నాయని, పంటలు పాడవుతున్నాయని 2016లో లోకాయుక్తను సంప్రదించగా జూన్ 2, 2023 న ఉత్తర్వులు ఇచ్చిందన్నారు.

జాతీయస్థాయి పోటీలకు మాడ్రన్ స్కూల్ విద్యార్థి

మహబూబ్‌నగర్ క్రీడలు: హర్యానాలో ఈనెల 21 నుంచి 29 వరకు జరిగే జాతీయస్థాయి సీనియర్ నెట్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని మాడ్రన్ హైస్కూల్ విద్యార్థి ప్రమిత ఎంపికైంది. మంగళవారం పాఠశాలలో విద్యార్థినిని ప్రిన్సిపాల్ దత్తు, పీఈటీలు విలియం, అర్పిత అభినందించి సన్మానించారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభచాటాలని ఆకాంక్షించారు.

స్వచ్ఛతా ప్రతిజ్ఞ

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఐక్యూసీ, ఎన్‌ఎస్‌ఎస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులతో స్వచ్ఛతాహి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ రవీందర్‌రావు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా.నందకిశోర్, రమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మూడు వాహనాలు ఢీ : ఒకరికి గాయాలు

అడ్డాకుల: జానంపేట సమీపంలో మంగళవారం 44వ నంబర్ జాతీయ రహదారిపై మూడు వాహనాలు ఒకదాని వెనుక మరొకటి ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. హైదరాబాద్ వైపు వెళ్లే దారిలో ఓ వాహనం ఒక్కసారిగా రోడ్డుపై నిలిచిపోయింది. దీంతో దాని వెనుక కారు ఢీకొట్టింది. కారు వెనుక మరో కారు ఢీకొట్టుకుంది. మూడు వాహనాలు పాక్షికంగా దెబ్బతినగా ఒక కారులో ఉన్న గద్వాలకు చెందిన నరేష్‌గౌడ్‌కు గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసునమోదు చేసి విచారణ చేపట్టారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

అడ్డాకుల: చక్రాపూర్ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సోమవారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్‌ఐ కె.శ్రీనివాసులు తెలిపారు. జాతీయ రహదారి నుంచి చక్రాపూర్ రోడ్డుపై వెళ్తుండగా పట్టుకుని ఠాణాకు తరలించామన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చిన్నచింతకుంట: బండ్రపల్లి ఊకచెట్టు వాగు నుంచి మరికల్‌కి చెందిన సీమ శ్యామ్ మంగళవారం ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

ఆర్‌యూబీ పరిశీలన



జడ్చర్ల: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో కొనసాగుతున్న రోడ్ అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ) పనులను వేగవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆదేశించారు. మంగళవారం పనులను పరిశీలించారు. సంబంధిత అధికారులతో పనుల పురోగతిపై చర్చించారు. యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

ఐదు రోజులు ఉత్సవాలు

పట్టణంలో గతంలో మాదిరిగానే గణేష్ ఉత్సవాలను ఐదు రోజుల పాటు నిర్వహించాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సూచించారు. స్థానిక అనురాగిణి ఆశ్రమంలో జరిగిన గణేష్ మండప నిర్వాహకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిమజ్జనోత్సవానికి సంబంధించి ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. చెరువులను పరిశీలించి నిమజ్జనోత్సవాలకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి స్థలం పరిశీలన



చిన్నచింతకుంట: మండల కేంద్రంలో మంగళవారం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. సీఎం ప్రతి పేదవాడికి ఇళ్లు అందించేలా కృషి చేస్తున్నాడన్నారు. అధికారులు ఇళ్ల నిర్మాణంలో జాప్యం వహించ రాదన్నారు. తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఐ తిరుపతయ్య, నాయకులు పాల్గొన్నారు.

నేడు అంతరాయం

మిడ్జిల్: మండల కేంద్రంలోని 133 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా బుధవారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని డీఈ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు.

రెండో వార్డులో ఫాగింగ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దోమల నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా మంగళవారం సాయంత్రం స్థానిక రెండో వార్డు పరిధి లోని బృందావన్‌కాలనీ, లక్ష్మీనగర్‌కాలనీ, ఎనుగొండ, గోల్డ్‌పార్కుకాలనీలలో ప్రత్యేక వాహనం ద్వారా ఫాగింగ్ చేశారు.

బీజేపీని బలోపేతం చేయాలి

అడ్డాకుల: బీజేపీని మరింత బలోపేతం చేయాలని నియోజకవర్గ నాయకుడు ఎగ్గని నర్సిములు అన్నారు. కందూర్‌లో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మున్నూర్ రమేష్ ఆధ్వర్యంలో సోమవారం పలువురిని పార్టీలో చేర్చుకున్నారు. ఉప సర్పంచ్ శంకర్, బుడ్డన్న, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

నేటినుంచి పోటీలు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని ఉన్నతపాఠశాలలో బుధవారం నుంచి క్రీడాపోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు హెచ్‌ఎం వెంకట్‌జీ, పీడీ సోమ్లానాయక్ వివరాలను తెలిపారు. మండలస్థాయిలో పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు.

చిన్నరేవల్లికి అభినందన

మహబూబ్‌నగర్ క్రీడలు: ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీలో విజేతగా నిలిచిన చిన్నరేవల్లి జట్టును సోమవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు. జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నీలో జట్టు విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. రూ.50వేల నగదు బహుమతి అందజేశారు.

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సమాజ హితం కోసం పాటుపడే జర్నలిస్టులకు అన్నివేళలా అండగా నిలుస్తామని మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కరోనా సమయంలో గుండెపోటుతో మృతి చెందిన జర్నలిస్ట్ హబీబ్ భార్య ఎజాజీతయ్యబాకు డబుల్ బెడ్ రూం పట్టాను మంగళవారం అందజేశారు. వారి పిల్లల చదువుకూ సాయం అందిస్తామన్నారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో ఎంఈడీ డిపార్ట్‌మెంట్‌లో ఫీజు రూ. 30వేలకు తగ్గించేందుకు కృషి చేసిన మంత్రికి పీయూ విద్యార్థి సంఘాల నాయకులు ధన్యవాదాలు తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ వినోద్‌కుమార్, రాము, మారుతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణకు సహకరించాలి

నవాబుపేట: క్షయ రహిత సమాజ ఏర్పాటుకు సహకరించాలని జిల్లా అధికారి డాక్టర్ రఫీక్ తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలో న్యూట్రిషన్ కిట్లు అందించారు. అప్రమత్తంగా ఉండి తగిన మందులు వాడితే క్షయ నివారణ సాధ్యమవుతుందన్నారు. నవాబుపేట పీహెచ్‌సీ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ మహేష్, తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



న్యూట్రిషన్ కిట్లు అందిస్తున్న జిల్లా క్షయ నివారణ అధికారి

బాలల సమస్యలను మేనిఫెస్టోలో చేర్చాలి



అమిస్తాపూర్‌లో సహపంక్తి భోజన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: బాలల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం కొన్ని అంశాలను కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టాలని కోరుతూ జవహర్ లాల్ బాల్ మంచ్ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ ఎస్.సుదర్శన్ సోమవారం లక్షద్వీప్ పీసీసీ అధ్యక్షుడు అహ్మదుల్లా సయాద్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యాహక్కు చట్టంపై మానిటరింగ్ ట్రిబ్యూనల్ ఏర్పాటు చేయాలని కోరారు. ఫీజుల నియంత్రణ, మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేలా పర్యవేక్షించాలని, అకాడమిక్ సిలబస్, కరిక్యులమ్ సురక్షితంగా ఉంచాలని వినతిలో విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తమిళనాడు రాష్ట్ర మైనారీ సెల్ అధ్యక్షుడు అస్లాంబాష, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, జవహర్‌బాల మంచ్ జిల్లా కోఆర్డినేటర్లు లక్ష్మీనారాయణ, ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్ : తెలంగాణలో కుటుంబ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఏఐసీసీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అబ్జర్వర్ మోహన్ కుమార మంగళం అన్నారు. బుధవారం అమిస్తాపూర్‌లో డీసీసీ జిల్లా అధ్యక్షుడు జి.మధుసుదన్‌రెడ్డి, పీసీసీ సంయుక్త కార్యదర్శి కాటం ప్రదీప్ కుమార్ గౌడ్, టీపీసీసీ అర్గనైజింగ్ సెక్రటరీలు కొండ ప్రశాంత్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు కుమ్మక్కై కవితను సాక్షిగా మాత్రమే విచారిస్తున్నారని ఆరోపించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. మండల కార్యాలయాన్ని ప్రారంభించారు. మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్, టౌన్ మహిళా అధ్యక్షురాలు పద్మ, టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.డి.సాధిక్ పాల్గొన్నారు.

ప్రాధాన్య పథకాలను పూర్తిచేయాలి



కరపత్రాన్ని విడుదల చేస్తున్న కలెక్టర్ ఇతర అధికారులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పురోగతిలో ఉన్న ప్రభుత్వ ప్రాధాన్య పథకాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రవి నాయక్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. పంట రుణాల మాఫీ, కొత్త రుణాల మంజూరు, ఎరువుల పంపిణీలపై అధికారులకు సూచనలు చేశారు. గృహలక్ష్మి ప్రొసీడింగ్స్ రూపొందించాలన్నారు. ఆసరా పెన్షన్ల మంజూరుపై నిర్ధారించుకున్న తర్వాతే చర్యలు తీసుకోవాలన్నారు. హరితహారం, సంపద వనాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న జియో ట్యాగింగ్ బుధవారం మధ్యాహ్నం నాటికి పూర్తి చేయాలని అన్నారు. అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్న స్వచ్ఛతాహీ సేవ పై రూపొందించిన కరపత్రాన్ని విడుదల చేశారు. సాంఘిక సంక్షేమ ఇళ్ల పట్టాలు, ఈ ఆఫీస్ పెండింగ్ ఫైళ్లు తదితర అంశాలపై సమీక్షించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ యాదయ్య, జిల్లా అధికారులు హాజరయ్యారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

- సభ్యుల అనాసక్తి
- నలుగురు ఎంపీటీసీలు, ఐదుగురు సర్పంచులు మాత్రమే హాజరు
- అధికారులది అదేదారి



సమస్యలపై ప్రశ్నిస్తున్న సర్పంచ్ సాయిరెడ్డి

అడ్డాకుల: మూసాపేట మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. సగం మంది ఎంపీటీసీలు, సగానికి పైగా సర్పంచులు సభకు గైర్హాజరవడం చర్చకు దారి తీసింది. హాజరైన కొందరు సభ్యులు సమస్యలపై అధికారులను నిలదీశారు. ఎంపీపీ కళావతి అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించగా ఎంపీడీఓ స్వరూప, తహసీల్దార్ బ్రహ్మంగౌడ్ హాజరయ్యారు. సభకు కేవలం నలుగురు మాత్రమే ఎంపీటీసీలు హాజరు కాగా 15 మందిలో అయిదుగురు సర్పంచులు మాత్రమే సభకు వచ్చారు. కొందరు అధికారుల తీరు అదే దారిలా కనిపించింది.

ఏడాదిగా తాగునీటి ఇబ్బంది

నందిపేటలో ఏడాది నుంచి తాగునీటి ఇబ్బంది ఉందని పట్టించుకోవడం లేదని సర్పంచ్ శేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ ద్వారా తక్కువ నీళ్లు రావడంతో బోరు మోటార్‌ను వినియోగించి నీళ్లు అందిస్తున్నామని, నెలకు రూ.25వేల పైనే కరెంటు బిల్లు వస్తోందని ఆందోళన వ్యక్తం చేశాడు. వాటర్ ట్యాంక్ సైతం శిథిలావస్థకు చేరిందని కొత్త ట్యాంకు నిర్మించే విధంగా చూడాలని కోరారు. కాగా వారంలోగా సమస్యను పరిష్కరించాలని ఏఈని ఎంపీడీఓ ఆదేశించారు. రేషన్ సరుకుల జారీలో అందరు వేలి ముద్రలు పెట్టాలని కోరడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని కొమిరెడ్డిపల్లి సర్పంచ్ సాయిరెడ్డి సభ దృష్టికి తెచ్చారు. నిజాలాపూర్, మహ్మదుస్సేన్‌పల్లి గ్రామాల రోడ్డుకు బీటీ వేయడానికి నిధులు మంజూరైనా ఇప్పట్లో పనులు మొదలయ్యే అవకాశం లేనందున ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేయించాలని ఎంపీటీసీ సీజీ.గోవర్ధన్ డిమాండ్ చేశారు. నిజాలాపూర్, మూసాపేట రోడ్డును కూడా బాగు చేయించే విధంగా చూడాలని కోరారు. ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ సరోజ, ఏఈ లక్ష్మణ్‌గౌడ్, ఏపీఓ పులేందర్, కార్యదర్శులు పాల్గొన్నారు.